


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 11-04-2026 సంపుటి : 07 సంచిక 312 పేజీలు : 8 వెల : రూ 3-00


# 'కొత్త పలుకు'పై వైసీపీ వ్యాఖ్యలు.


## . కేబినెట్‌లో చర్చ.. సీఎం ఫైర్



అమరావతి, ఏప్రిల్ 10: ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో 'కొత్త పలుకు'పై వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ఏపీ కేబినెట్‌లోచర్చ జరిగింది. మంత్రి నిమ్మల రామానాయుడు ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'కొత్త పలుకు కాదు... ఇక పలుకే ఉండదు' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు రామానాయుడు కేబినెట్‌కు తెలియజేశారు. దీనిపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. 'లేపేస్తాను అని అంటున్నారు... వైసీపీ అరాచకాలు పరాకాష్టకు చేరాయి. ఎవరిని లేపుతారు.. ఇటువంటి క్రిమినల్స్ చేసే బెదిరింపులకు ఎవరూ భయపడరు' అని సీఎం అన్నారు.క్రిమినల్స్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఫర్మ్‌గా డీల్ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. బెదిరించి భయపెడదామని అనుకుంటున్నారని మండిపడ్డారు. ఇటువంటి రాజకీయాలను ఎప్పటికప్పుడు జాగ్రత్తగా గమనించాలని, అన్ని విషయాలను ప్రజలకు తెలియజేయాలని మంత్రులకు సీఎం సూచించారు. 'క్రిమినల్స్ ఇలానే రాజకీయాలు చేస్తారు. వాళ్ల ఆటలు సాగనివ్వకూడదు. ప్రజలకు నిజాలు తెలియచేస్తే సరిపోతుంది. డైవర్షన్ పాలిటిక్స్‌కు వాళ్లు అలవాటు పడ్డారు' అంటూ ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు.కేబినెట్ అజెండా లీక్ అవుతున్న విషయంపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. 'కేబినెట్ అజెండా బయటకు వెళ్తుంది. అందరం బాధ్యతగా ఉండాలి. చాలా ముఖ్యమైన విషయాలు ఉంటాయి... ముందు మన వద్దకు వస్తుంది' అని సీఎం అన్నారు. గతంలో బడ్జెట్ లీక్ అయితే 30 మంది మంత్రులు రాజీనామా చేశారని, ఎన్టీఆర్ ఎవరు లేకుండా 15 రోజులు ప్రభుత్వాన్ని నడిపారని సీఎం గుర్తు చేశారు. పేపర్ లీక్ కేసులో ఆ రోజు బాలయోగి రాజీనామా చేశారని చెప్పారు. ఇప్పుడు సాంకేతికతతో ఎవరి నుంచి లీక్ అయిందో తేలికగా కనుక్కోవచ్చని స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శులు బాధ్యతగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

# భోగాపురం విమానాశ్రయం..
# ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు





విశాఖపట్నం, ఏప్రిల్ 10 : ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఏపీ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. జూలై మొదటి వారంలో ఈ విమానాశ్రయం ప్రారంభం కానుండటంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోనున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు తుది దశకు చేరుకున్నాయి. జూలై 5వ తేదీ లేదా 8వ తేదీన ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇప్పటికే ఆహ్వానం పంపారు. మోదీ షెడ్యూల్ ఆధారంగా జూలై 5వ తేదీ లేదా 8వ తేదీల్లో ఒకటి ఖరారు కానుంది. జూన్ 30వ తేదీ కల్లా మిగిలిన అన్ని పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తున్నారు. అంతర్జాతీయ విమానాల రాకపోకల కోసం అవసరమైన ఇమ్మిగ్రేషన్ స్టేటస్ నోటిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేసింది. విశాఖపట్నం నుంచి భోగాపురం వెళ్లే మార్గంలో అత్యంత రద్దీగా ఉండే ఆనందపురం జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ఫ్లై ఓవర్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. దీనికి సంబంధించిన డీపీఆర్45 రోజుల్లో సిద్ధం కానుంది. భోగాపురం వరకు మెట్రో సౌకర్యాన్ని కల్పించేందుకు ఖీమిఇూ సంస్థ సవరించిన డీపీఆర్‌ను సిద్ధం చేస్తోంది. ఇది డబుల్ డెక్కర్ మోడల్‌లో ఉండబోతోంది (కింద రోడ్డు, పైన మెట్రో). విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి భోగాపురం వరకు ఈ కారిడార్ విస్తరించనుంది. రోడ్ నంబర్ 12, 14 పనుల కోసం అటవీ, రక్షణ శాఖల అనుమతులను వేగవంతం చేశారు. తీర ప్రాంతం వెంట విశాఖను భోగాపురంతో కలిపే ప్రత్యేక కోస్టల్ కారిడార్ పనులు కూడా ఊపందుకున్నాయి. భోగాపురం ఎయిరోసిటీ, ఐటీ హబ్స్, లాజిస్టిక్ పార్కుల వల్ల ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి లభించనుంది. భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు త్వరలో పూర్తవుతాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. కేంద్రప్రభుత్వ సహకారంతో ఏపీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు జూలై మొదటి వారంలో ప్రారంభించాటానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఇదో మైలు రాయని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభించటానికి ప్రయత్నిస్తున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

### రాజ్యసభకు హరివంశ్‌ను నామినేట్ చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ: రాజ్యసభ మాజీ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ తిరిగి రాజ్యసభకు రానున్నారు. ఆయనను రాజ్యసభకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నామినేట్ చేశారు. ఈ మేరకు శుక్రవారంనాడు గెజిట్ నోటిఫికేషన్ జారీ అయింది. బిహార్ నుంచి జేడీ(యూ) సభ్యుడిగా ఉన్న హరివంశ్ పదవీ కాలం ఏప్రిల్ 9వ తేదీతో ముగిసింది. 2018 నుంచి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా హరివంశ్ వ్యవహరిస్తున్నారు. రాజ్యాంగంలోని సెక్షన్3 లోని క్లాజ్ (1), సబ్ సెక్షన్ (ఎ) కింద 69 ఏళ్ల హరివంశ్‌ను రాష్ట్రపతి నామినేట్ చేశారు.

# మహిళా రిజర్వేషన్లపై బీజేపీ 'మాస్టర్ ప్లాన్'..

## పార్లమెంటు బిల్లుకు ముందే దేశవ్యాప్త ప్రచారం!



ఢిల్లీ, ఏప్రిల్ 10 : ఢిల్లీ వేదికగా రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. దశాబ్దాలుగా నలుగుతున్న మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణ బిల్లు పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దీనిని ఒక చారిత్రాత్మక విజయంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. భారత రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. 2029 ఎన్నికల నుంచే చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా చట్టంలో అవసరమైన సవరణలు తీసుకువచ్చేందుకు రంగం సిద్ధమైంది.మహిళ బిల్లుపై దేశవ్యాప్త అవగాహన కల్పించేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం వ్యూహరచన చేస్తోంది. ఇందులో భాగంగానే ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో పలు రాష్ట్రాల అధ్యక్షులతో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావుతో పాటు ఇరు రాష్ట్రాల ఇన్‌చార్జ్ కార్యదర్శులు హాజరయ్యారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడానికి ఉన్న ఈ ఐదు రోజుల్లో పలు రాష్ట్రాల వ్యాప్తంగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళ బిల్లు చర్చకు రానుంది. మూడు రోజుల్లోనే వీటికి ఆమోద ముద్ర వేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మహిళా రిజర్వేషన్లను 2029 సాధారణ ఎన్నికల నుంచి అమల్లోకి తీసుకురావాలని మోదీ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనివల్ల చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలుకు, నియోజకవర్గాల పునర్విభజనకు బీజేపీ సర్కార్ సిద్ధమవుతోంది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ప్రస్తుతం ఉన్న స్థానాల సంఖ్యను 50 శాతం వరకు పెంచాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ విషయంపై ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్ని పార్టీలతో సంప్రదింపులు జరిపారు.మహిళా రిజర్వేషన్లకు అన్ని పార్టీలు మద్దతు ఇస్తున్నప్పటికీ, అమలు చేసే విధానంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విపక్ష పార్టీలు 2011 గణాంకాల కంటే, 2026 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. నియోజకవర్గాల సంఖ్య పెంచడం వల్ల దక్షిణ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనల నేపథ్యంలో 2026 లెక్కల ప్రాధాన్యతను విపక్షాలు నొక్కి చెబుతున్నాయి. పార్లమెంటులో మహిళ బిల్లు ఆమోదం పొందిన తర్వాత దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున విజయోత్సవ ర్యాలీలు నిర్వహించి, మహిళా ఓటర్లను తమవైపు తిప్పుకోవాలని బీజేపీ భావిస్తోంది.

# వైసీపీ నేతలది గుంట నక్కల రాజకీయం: కేంద్ర మంత్రి రామ్మోహన్



శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ఆధారితమని, జిల్లా ప్రజలకు సాగునీటి భద్రత కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. వంశధార నీటిని సద్వినియోగం చేసుకుని జిల్లాను సస్యశ్యామలం చేయాలని పూనుకున్నట్లు ఆయన చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రీకాకుళంలో సాగునీటి వ్యవస్థను గాలికి వదిలేశారని కేంద్ర మంత్రి మండిపడ్డారు. 2010లో వంశధార ట్రైబ్యునల్ ఏర్పాటు అయ్యిందని.. అప్పటి నుంచి నేరడి బ్యారేజ్ విషయంలో ఒడిశాతో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసినట్లు ఆయన చెప్పారు. 2024లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నేరడి బ్యారేజ్ సమస్యపై దృష్టి పెట్టామని ఈ సందర్భంగా రామ్మోహన్ చెప్పుకొచ్చారు. ఒడిశాలోనూ బీజేపీ ప్రభుత్వం రావటంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. వంశధార ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్ తెచ్చుకున్నామని.. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారమైందని తెలిపారు. దీనిపై వైసీపీ నేతలు ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అయినా తన మొదటి ప్రాధాన్యత జిల్లా అభివృద్ధికే అని రామ్మోహన్ స్పష్టం చేశారు.త్వరలో నేరడి బ్యారేజ్ పనులు ప్రారంభమవుతాయని.. రైల్వే జోన్ సాధించుకోవటం మరో విజయమంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలోని ఏడు రైల్వేస్టేషన్లను కొత్త రైల్వే జోన్‌లో పెట్టించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తిరుపతి వెళ్లే భక్తుల కోసం హంసఫర్ ఎక్స్‌ప్రెస్ ఇకపై శ్రీకాకుళం నుంచి బయలుదేరుతుందంటూ ఆయన గుడ్ న్యూస్ చెప్పారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేశామని.. పొందూరు ఖాదీకి జియో ట్యాగ్ సాధించామనీ వెల్లడించారు. కేంద్రం నుంచి జిల్లాకు అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తున్నానని రామ్మోహన్ పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి జరుగుతుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ ఆగ్రహించారు. ప్రజల కోసం పని చేసే నేతలైతే కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేసిన పనులను అభినందించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మక ఘట్టమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అమరావతి బిల్లుకు కాంగ్రెస్ కూడా మద్దతు ఇచ్చిందని.. జగన్ పార్టీ మాత్రం బిల్లు సందర్భంగా పార్లమెంట్ నుంచి వాకౌట్ చేసిందని మండిపడ్డారు.




# సంపాదకీయం

శనివారం 11-04-2026

## పొంచి ఉన్న కరువు పరిస్థితులు...

గత ఏడాది రికార్డు స్థాయిలో వర్షాలు కురిసాయి. పంటలు సమృద్ధిగా పండాయి. కానీ ఈ ఏడాది అలా పరిస్థితి ఉండదని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రధానంగా పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా మారుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా.. 2026 లో అత్యంత బలమైన ఎల్ నినో పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు కురిసే అవకాశం కనిపించడం లేదని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వర్షాకాలం దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది రైతులకు అత్యంత కష్టతరంగా మారబోతోందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే ముందుగానే ఈ హెచ్చరికలు వచ్చాయి. కానీ ఎల్ నినో ప్రభావం ఈ స్థాయిలో ఉండబోతుంది అని తెలుస్తుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది.కొన్ని ప్రాథమిక విశ్లేషణల ప్రకారం ఈ ఏడాది ఇబ్బందికర పరిస్థితులు తప్పవని అర్థమవుతోంది. ఈ శతాబ్దంలోనే అత్యంత తీవ్రమైన ఉష్ణ మండల వాతావరణం నమోదయ్యే ప్రమాదం ఉంది. రుతుపవనాల గమనాన్ని అస్తవ్యస్తం చేసి.. వర్షాలు పడకుండా చేస్తోందని తెలుస్తోంది. వ్యవసాయ రంగం దారుణంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఎల్ నినో ప్రభావం ఉన్న ప్రతిసారి మన దేశంలో వర్షపాతం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. అటువంటిది ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని తెలియడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. సుదీర్ఘమైన కరువు కాటకాలకు దారి తీయవచ్చు అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రైతులకు ప్రయోజనం చేకూర్చే నైరుతి రుతుపవనాలను ఎల్ నినో నాశనం చేస్తుందని చెబుతున్నారు. వర్షాలు సరిగ్గా పడక తీవ్ర దుర్భిక్షం ఏర్పడుతుందని.. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గి.. భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని.. రైతాంగం తీవ్ర పెట్టుబడి నష్టాలను చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరికలు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.మెరికా, ఇరాన్ దేశాల మధ్య నిన్నటిదాకా భీకరమైన యుద్ధం జరిగింది. కాల్పుల విరమణ ఒప్పందం ద్వారా ఆ యుద్ధం తాత్కాలికంగా వాయిదా పడింది. యుద్ధం వల్ల జరిగే దాడులు విపరీతమైన కాలుష్యానికి కారణమవుతుంటాయి. కాలుష్యం వల్ల వాతావరణంలో అనేక రకాలుగా మార్పులు చోటుచేసుకుంటాయి. వాటి వల్ల కరువు కాటకాలు ఏర్పడుతుంటాయి. రెండవ ప్రపంచ యుద్ధాన్ని తీసుకుంటే.. నాడు అమెరికా వేసిన న్యూక్లియర్ బాంబు వల్ల జపాన్ తీవ్రంగా నష్టపోయింది. ఆ బాంబు వేసిన ప్రాంతంలో ఇప్పటికీ పచ్చ గడ్డి కూడా మొలవడం లేదు. దీనిని బట్టి యుద్ధం లాంటి వైపరీత్యాలు చోటు చేసుకున్నప్పుడు ప్రకృతి ఎంత ప్రభావితమవుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇక యుద్ధం తాత్కాలికంగా ముగిసింది అనుకుంటే.. మరో ఉపద్రవం ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతోంది. ఈసారి ప్రపంచాన్ని ఆ విధంగా కలవరపెడుతున్న అంశం యుద్ధం కాదు.. మరొకటి కాదు.. అది కరువు.ఈ కరువు ఏర్పడేందుకు ప్రధాన కారణం పసిఫిక్ మహాసముద్రం. కొంతకాలంగా పసిఫిక్ మహాసముద్రం వేడెక్కుతోంది. దీనివల్ల ఎల్ నినో ఏర్పడుతోంది. ఎల్ నినో అనేది పసిఫిక్ సముద్రంలో సాధారణంగా ఏర్పడేదే. అయితే ఈసారి ఏర్పడుతున్న ఎల్ నినో అత్యంత ప్రమాదకరమైనది. దీనివల్ల 2027 వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎండలు మండిపోతాయట. చివరికి ధ్రువ ప్రాంతాలలో కూడా ఉష్ణోగ్రతలు పెరుగుతాయట. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశమైన భారత్ లో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు కురిసే అవకాశం లేదట. దీనివల్ల సాగురంగం పూర్తిగా దెబ్బతింటుందట. మనదేశంలో కరువు పరిస్థితి ఉంటే.. దక్షిణ అమెరికాలో భారీగా వరదలు వస్తాయట. విస్తారమైన వర్షాలు కురిసి ప్రాంతాలకు ప్రాంతాలు మీట మునిగిపోతాయట. సముద్ర తీర ప్రాంతం మరింత ముందుకు దూసుకు వస్తుందట.. తీర ప్రాంతాలు కోతకు గురి అవుతాయట.మనదేశంలో కరువు అనుకుంటే.. ఆసియా మొత్తం కూడా కరువు వచ్చే అవకాశం ఉంటుందట. వాతావరణ మొత్తం అల్లకల్లోలంగా ఉంటుందట. అందువల్లే ఇప్పటినుంచే ఆయా ప్రభుత్వాలు సిద్ధంగా ఉండాలని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కరువు వల్ల చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆహార ధాన్యాలకు.. ఇతర తిండి గింజలకు తీవ్రమైన కొరత ఏర్పడుతుంది. ఆ సమయంలో మరణాలు కూడా చోటుచేసుకుంటాయి. ఇవన్నీ జరగకూడదు అనుకుంటే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో సర్వసాధారణంగా ఏర్పడేదే. అయితే ఈసారి అత్యంత తీవ్రమైన ఎల్ నినో ఏర్పడడం వల్ల కరువు కాటకాలు అధికంగా వస్తాయట.ఒక్క వర్షాభావ పరిస్థితులే కాదు.. దేశవ్యాప్తంగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని కూడా హెచ్చరికలు వస్తున్నాయి. అసాధారణ రీతిలో పెరుగుతాయని సంకేతాలు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయరంగం పూర్తిగా దెబ్బతింటే ఆ ప్రభావం దేశం పై పడుతుంది. అందుకే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకసారి మన దేశ చరిత్రను గమనిస్తే.. ఎక్కువ శాతం కరువులు ఎల్ నినో సమయంలో సంభవించినవే. 2009లో అత్యంత తీవ్రమైన ఎల్ నినో కారణంగా దేశంలో అంతకుముందు 30 ఏళ్లలో లేనంతగా.. 22 శాతం వర్షపాతం తగ్గింది. దీనికి కారణంగా దేశవ్యాప్త కరువుకు దారితీసింది. 2014 నుంచి 2016 మధ్య ఎల్ నినో ప్రభావంతో వరుసగా రెండు సంవత్సరాలు వర్షాలు తగ్గి వ్యవసాయరంగం తీవ్రంగా నష్టపోయింది. 2023 లో కూడా ఎల్ నినో ప్రభావంతో ఆగస్టు నెలలో వందేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ వర్షపాతం నమోదయింది.. అయితే ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని తెలియడంతో తీవ్ర దుర్భిక్షం తప్పదన్న హెచ్చరికలు వస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# రాష్ డ్రైవింగ్‌తో ఇసుక ట్రాక్టర్ల రోతన

**కాలనీవాసుల ఆగ్రహం**

**రోడ్డు పై స్తంభాలు, మొద్దులు పేర్చి వినూత్న నిరసన**

**దుమ్ము-ధూళితో పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపణ**

**అనుమతికి మించి ట్రిప్పులు**

**అక్రమ రవాణాపై కాలనీవాసుల విమర్శలు**

**సంతకాల సేకరణతో తహసిల్దార్, పోలీసులకు వినతిపత్రం ఇవ్వనున్న ప్రజలు**

వికారాబాద్ , తాండూరు పట్టణంలోని వార్డు నెంబర్ 17 పరిధిలోని పాత తాండూరు గడీ ప్రాంతంలో ఇసుక ట్రాక్టర్ల రాష్ డ్రైవింగ్‌పై కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజూ వందల సంఖ్యలో వెళ్లే ఇసుక ట్రాక్టర్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ట్రాక్టర్లు అధిక వేగంతో వెళ్తుండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్డుపై నడవడానికి కూడా భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో కాలనీవాసులు రోడ్డుపై స్తంభాలు, మొద్దులు పేర్చి నిరసన వ్యక్తం చేశారు.ఇసుక ట్రాక్టర్ల కారణంగా ఎగిసే దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరుతుండటంతో ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు.ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేవలం రెండు ట్రాక్టర్లకు మాత్రమే అనుమతి ఇచ్చినప్పటికీ, ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఒక్కో ట్రాక్టర్ పదుల సంఖ్యలో ట్రిప్పులు చేస్తున్నాయని కాలనీవాసులు ఆరోపించారు. ఇది పూర్తిగా అక్రమ రవాణా అని విమర్శించారు.రోజూ ఇక్కడి నుంచి వెళ్లే ట్రాక్టర్ల సంఖ్య చూస్తే, రాష్ట్రంలోని అన్ని ఇందిరమ్మ ఇళ్లను నిర్మించవచ్చని స్థానికులు ఎద్దేవా చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కాలనీలో ఇసుక ట్రాక్టర్ల రాకపోకలను నియంత్రించాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు సంతకాల సేకరణ చేపట్టి, తహసిల్దార్ మరియు పట్టణ పోలీసులకు వినతిపత్రం అందించేందుకు సిద్ధమవుతున్నారు

# పోలీసు శాఖ ప్రతిష్టను చాటిచెప్పండి

**హోంగార్డులకు రీజియన్ కమాండెంట్ పిలుపు.**

**తమిళనాడు ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి.**

**ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూనే మెరుగైన సేవలు అందించాలి.**

**మదనపల్లిలో ఘనంగా హోంగార్డుల పరేడ్..**

**పాల్గొన్న కమాండెంట్ . యం. మహేష్ కుమార్**

మదనపల్లి, ఏప్రిల్ 10: పోలీసు వ్యవస్థలో హోంగార్డుల సేవలు అత్యంత కీలకమని, విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ శాఖ ప్రతిష్టను పెంచేలా పని చేయాలని రాయలసీమ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం మదనపల్లిలోని బి.టి. కళాశాల పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా స్థాయి హోంగార్డులకు ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కమాండెంట్ పరేడ్ లో హోంగార్డుల గౌరవ వందనాన్ని స్వీకరించి, సిబ్బంది పనితీరును తనిఖీ చేశారు.ఎన్నికల విధులే పరమావధి:త్వరలో తమిళనాడులో జరగనున్న సాధారణ ఎన్నికల విధులకు వెళ్లే హోంగార్డులకు ఆయన ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. పరాయి రాష్ట్రంలో విధులు నిర్వహించేటప్పుడు అత్యంత ఓర్పుతో ఉండాలని, ఓటర్లతో మర్యాదగా ప్రవర్తిస్తూనే నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న మెళకువలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ జిల్లా పోలీసు యంత్రాంగానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఆరోగ్యమే మహాభాగ్యం:సవాళ్లతో కూడుకున్న పోలీసు ఉద్యోగంలో ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని కమాండెంట్ స్పష్టం చేశారు. "మీరు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి సమర్థవంతంగా సేవ చేయగలరు" అని పేర్కొన్నారు. అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, ప్రయాణాల్లో జాగ్రత్తలు వహిస్తూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్ వ్యక్తి గత ఇన్స్యూరెన్స్ లు కలిగి ఉండాలని సూచించారు.సమస్యల పరిష్కారానికి 'దర్బార్':అనంతరం నిర్వహించిన 'దర్బార్'లో హోంగార్డులు తమ సమస్యలను కమాండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సబ్ డివిజన్ ఇంచార్జిలకు లేదా రిజర్వ్ ఇన్స్పెక్టర్‌కు తెలపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ డి. ఏడుకొండల రెడ్డి, హోంగార్డ్స్ డీఎస్పీ కె.బి.వి. ప్రసాద్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కె. సురేష్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ఐలు ఏ. శ్రీనివాస్, జి.రవి, హోంగార్డ్స్ ఇంచార్జీలు మరియు పెద్ద సంఖ్యలో హోంగార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# కల్నల్ శ్రీకాంత్ పురోహిత్‌కు బ్రిగేడియర్ హోదా.. ఆమోదం తెలిపిన భారత సైన్యం

లెఫ్టినెంట్ కల్నల్ శ్రీకాంత్ పురోహిత్ కు బ్రిగేడియర్ గా పదోన్నతి కల్పించేందుకు భారత సైన్యం ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో శ్రీకాంత్ పురోహిత్ కూడా అభియోగాలు ఎదుర్కొన్నారు. అయితే ముంబైలోని ప్రత్యేక కోర్టు గత ఏడాది ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.పదోన్నతి పదవీకాల ప్రయోజనాలను కోరుతూ కల్నల్ సాయుధ దళాల ట్రిబ్యునల్ లో పిటిషన్ దాఖలు చేశారు. మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసు



విచారణ సుదీర్ఘకాలం సాగడంవల్ల తన వృత్తిపరమైన పురోగతిపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 31న జరగాల్సిన కల్నల్ పదవీ విరమణపై ఏఎఫ్‌టీ స్టే విధించింది. ఈ క్రమంలో రక్షణశాఖకు నోటీసులు జారీచేసింది. కల్నల్ చేసిన చట్టబద్ధమైన ఫిర్యాదుపై నిర్ణయం తీసుకునేంత వరకు అతడి పదవీ విరమణను ఆపేయాలని అందులో పేర్కొన్నది.ఈ క్రమంలోనే శ్రీకాంత్ పురోహిత్‌కు పదోన్నతి కల్పిస్తూ భారత సైన్యం నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబర్ 29న పేలుడు సంభవించింది. ఈ పేలుడులో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా.. మరో 100 మందికిపైగా గాయపడ్డారు. ఈ ఘటనలో మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ శ్రీకాంత్ పురోహిత్ సహా మొత్తం ఏడుగురిపై కేసు నమోదైంది. గత ఏడాది ఈ కేసుపై విచారణ జరిపిన ఎన్ఐఏ కోర్టు అభియోగాలు ఎదుర్కొంటున్న అందరినీ నిర్దోషులుగా తేల్చింది.

## అభిశంసనకు ముందే.. రాష్ట్రపతికి రాజీనామా పంపిన జస్టిస్ యశ్వంత్ వర్మ

న్యూఢిల్లీ: జస్టిస్ యశ్వంత్ వర్మరాజీనామా చేశారు. ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టులో ఆయన జడ్జీగా ఉన్నారు. అవినీతి ఆరోపణ కేసులో ఆయనపై అభిశంసన ప్రక్రియ జరుగుతున్న విషయం తెలిసిందే. జడ్జీ హోదా నుంచి ఆయన్ను తప్పించేందకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జస్టిస్ యశ్వంత్ వర్మ అకస్మాత్తుగా రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ముర్ముకు పంపారు. గత ఏడాది ఢిల్లీలోని ఆయన నివాసం నుంచి భారీ ఎత్తున నోట్ల కట్లను రికవరీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రపతికి రాసిన రాజీనామా లేఖలో ఆయన ఎటువంటి కారణాన్ని వెల్లడించలేదు. కానీ తక్షణమే అలహాబాద్ కోర్టు నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించారు. ఏప్రిల్ 9వ తేదీన ఆయన ఆ లేఖ రాశారు.యశ్వంత్ వర్మ రాజీనామా చేయడం వల్ల.. ఆయనపై చేపట్టాల్సిన అభిశంసన ప్రక్రియ నిలిచిపోతుందని లోక్‌సభ సెక్రటేరియట్ వెల్లడించినట్లు ఓ అధికారి ద్వారా తెలిసింది. రాజీనామా తర్వాత జస్టిస్ వర్మకు యధావిధిగా పెన్షన్‌తో పాటు ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందుతాయి. ఒకవేళ ఆయన్ను పార్లమెంట్ తొలగిస్తే, అప్పుడు ఆయనకు బెనిఫిట్స్ అందేవి కాదు. ఢిల్లీ హైకోర్టు జడ్జీగా ఉన్న సమయంలో.. 2025 మార్చి 14వ తేదీన ఆయన ఇంట్లో భారీగా నగదును సీజ్ చేశారు. ఆయన ఉంటున్న క్వార్టర్స్‌లోని స్టోర్‌రూమ్‌లో సగం కాలిన నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో జస్టిస్ వర్మతో పాటు ఆయన భార్య భూపాల్‌లో ఉన్నారు. స్టోర్‌రూమ్‌లో నగదును తాము పెట్టలేదని జడ్జీ చాలా సార్లు తెలిపారు.

## నేరేడుచర్లలో అంతరాష్ట్ర ధాన్యం లారీల తనిఖీ



నేరేడుచర్ల, ఏప్రిల్ 10 : నేరేడుచర్లలో పౌర సరఫరాల శాఖ అధికారులు శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పోలీసులతో కలిసి అంతర్రాష్ట్ర ధాన్యం లారీలను తనిఖీ చేశారు. ధాన్యం సేకరణ ప్రారంభమై వడ్లు మిల్లులకు రవాణా అవుతున్న సందర్భంగా ఆంధ్రా నుండి ధాన్యం లారీలు తెలంగాణలోకి రాకుండా ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ధాన్యం ఎక్కడి నుండి వస్తోంది.. ఏ మిల్లులలు వెళ్తోంది, రైతు పేరు వంటి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాసీల్దార్ మాచన రఘునందన్, ఆర్.సైదులు పాల్గొన్నారు.

# కాపుగంటి సోమన్న వర్ధంతి



కట్టంగూర్, ఏప్రిల్ 10 : కట్టంగూర్ మాజీ సర్పంచ్, దివంగత కాపుగంటి సోమన్న వర్ధంతిని మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామ పంచాయితీ కార్యాలయ అవరణలో ఉన్న ఆయన విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాపుగంటి సోమన్న గ్రామానికి అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుండు రాంబాబు, నాయకులు మిట్టపల్లి శివ, మర్రి రాజు, గద్దపాటి దానయ్య, కొంపెల్లి యాదయ్య, రెడ్డిపల్లి వీరస్వామి, యర్కల సైదులు, ముషం ఉమేశ్, గంటెకంపు లింగయ్య, వార్డు సభ్యులు కానుగు శ్రీను, అయితగోని సైదులు, బొమ్మగాని మహేశ్, కాపుగంటి నరేశ్, పొడిచేటి శ్రీకాంత్, వెంకట్, మేడి విజయ్, రాము, గణేశ్, శివ పాల్గొన్నారు.

# 'ఆ ఇద్దరిని అనర్హులుగా ప్రకటించండి'

**కొత్తగూడెం మున్సిపల్ ఎన్నికలపై పిటిషన్లు దాఖలు**

**ప్రతివాదులకు కోర్టు నోటీసులు జారీ**




రుద్రంపూర్, ఏప్రిల్ 10 : ఇటీవల జరిగిన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై రెండు ఎన్నికల పిటిషన్లు దాఖలయ్యాయి. డివిజన్ 47 (పాత పాల్వంచ), డివిజన్ 54 (సఫాయి బస్తీ) ఎన్నికలను రద్దు చేసి, గెలిచిన అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ జిల్లా కోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి. డివిజన్ 47లో సీపీఐ అభ్యర్థి గుర్రం వెంకటేశ్వర్లు గెలుపును సవాలు చేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి మిర్యాల అలివేలు పిటిషన్, అలాగే డివిజన్ 54లో కాంగ్రెస్ అభ్యర్థి జయంతి మసూద్ గెలుపును వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి మాదాసు పద్మ పిటిషన్ వేశారు. ఈ రెండు కేసుల్లో పిటిషనర్ల తరపున న్యాయవాదులు ఎండీ.సాదిక్ పాషా, డి.సామంత్, సంకుబాపన అనుదీప్ వాదనలు వినిపించారు. పిటిషన్లను పరిశీలించిన జిల్లా కోర్టు వాటిని స్వీకరించి, ఎన్నికల పిటిషన్ నంబర్లు 2/2026 , 3/2026గా నమోదు చేసినట్లు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను మే 6కు వాయిదా వేసినట్లు వారు పేర్కన్నారు.

## గాంధేయ మార్గంలో టోపీలు ధరించి ఆర్టిజన్ల నిరసన

జహీరాబాద్ : విద్యుత్ సంస్థలోని ఆర్టిజన్(ల సమస్యలు పరిష్కరించాలని జహీరాబాద్ డివిజన్ జేఏసీ నాయకులు జైపాల్, సంతోష్, రాజప్ప డిమాండ్ చేశారు. సమ్మె మూడో రోజున శుక్రవారం జహీరాబాద్ పట్టణం విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో గాంధేయ మార్గంలో కార్మికులు టోపీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో ఆర్టిజన్లుగా పనిచేస్తున్నవారి విద్యార్హతలను బట్టి వారికి కన్వర్షన్ ఇవ్వాలని పేర్కొన్నారు. కొన్ని సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం వారికి ప్రత్యేక పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.సమస్యను పరిష్కరించేంత వరకు సమ్మెలో పాల్గొంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రాజేష్, రాజప్ప ,మొగులప్ప ,సత్యంధర్ రెడ్డి, విష్ణు, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.



# మీ పనే ప్రోగ్రెస్ రిపోర్ట్...

విజయవాడ. ఏప్రిల్ 10,పని తీరే ప్రోగ్రెస్ రిపోర్ట్. రెస్పాన్సిబుల్‌గా పనిచేయండి. జనాల్లోనే ఉండండి. అంటూ మంత్రులు, ఎమ్మెల్యేలకు పదే పదే సూచిస్తున్న సీఎం చంద్రబాబు..లేటెస్ట్‌గా మరో మంత్రి తీరుపై సీఎం చంద్రబాబు, లోకేష్ సీరియస్ అయినట్లు వార్తలు వస్తున్నాయి. ప్రభుత్వంపై ప్రజల్లో పాజిటివ్ ఒపీనియన్ ఉన్నప్పటికీ..అక్కడక్కడ మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై మాత్రం పబ్లిక్‌లో నెగెటివిటీ ఉందట. అందుకే మొదటి నుంచి అలర్ట్ అవుతూ వస్తున్నారు సీఎం చంద్రబాబు. ఎమ్మెల్యేలు, మంత్రులతో మీటింగ్ జరిగితే చాలు..కనీసం ఒకరు ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేల తీరును వివరిస్తూ..మిగతా వారికి వార్నింగ్‌లు పంపిస్తున్నారు. పద్ధతి, పనితీరు మారితేనే వచ్చే ఎన్నికల్లో సీటు లేకపోతే..సీన్ కట్ అంటూ ఓపెన్‌గానే చెప్పేస్తున్నారు. అయినా కొందరు మంత్రులు బిహేవియర్‌లో ఏ మాత్రం మార్పు రావడం లేదట. ఈ క్రమంలోనే ఈసారి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వంతు వచ్చిందని అంటున్నారు.మంత్రుల కంటే వారి పర్సనల్ సెక్రటరీ, కుటుంబసభ్యుల జోక్యం విపరీతంగా పెరుగుతోందని సీఎం అసహనం వ్యక్తం చేశారట. వ్యవహారం తన దృష్టికి రావడంతో విజయనగరం జిల్లా నుంచి మంత్రిగా ఉన్న కొండపల్లి శ్రీనివాస్‌ను గట్టిగా మందలించారని అంటున్నారు. ఆయన ఫస్ట్ టైమ్ మినిస్టర్‌గా ఉండగా..ప్రభుత్వ అధికార కార్యక్రమాల్లో మంత్రి శ్రీనివాస్ తండ్రి జోక్యం విపరీతంగా పెరిగిందట. అధికార కార్యక్రమాల్లో మంత్రి తండ్రి జోక్యంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారట. కుటుంబసభ్యుల ప్రమేయం తగ్గించమని ఎన్నిసార్లు చెప్పినా వినట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారట. మీ తండ్రిని పాలిటిక్స్‌కు దూరంగా పెట్టాలని మంత్రి కొండపల్లికి సూచించారట సీఎం. అయితే ఆరు నెలలుగా ఏ వ్యవహారంలోనూ తన తండ్రి జోక్యం చేసుకోవడం లేదని చెప్పే ప్రయత్నం చేశారట మంత్రి కొండపల్లి. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మంత్రిని చేశానని, అందరిని కలుపుకొని ముందుకెళ్తూ..పని తీరు మార్చుకోవాలని మందలించారట సీఎం.అటు పలువురు ఎమ్మెల్యేలపై టీడీజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారట. పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించిన లోకేశ్.. నియోజకవర్గాల్లో క్యాడర్‌తో మీటింగ్‌లు, గ్రీవెన్స్‌లు ఏర్పాటు చేయని నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారట. కడప జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేల తీరుపై లోకేశ్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డిపై లోకేశ్ సీరియస్ అయినట్లు చెబుతున్నారు. వీరితో పాటు వరుసగా నాలుగు వారాల పాటు గ్రీవెన్స్ సమావేశాలు నిర్వహించని పార్టీ నేతలను లోకేశ్ మందలించారట.గ్రీవెన్స్‌లు ఎందుకు పెట్టలేదో కారణాలను తెలుసుకోవాలని, వివరణ తీసుకోవాలని పార్టీ కార్యాలయ సిబ్బందిని ఆదేశించారట. ఎమ్మెల్యేలు కాకుండా ఇలా నాలుగు వారాలుగా క్యాడర్ సమావేశాలు నిర్వహించని వారిలో పులివెందుల ఇన్‌చార్జ్ బీటెక్ రవి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి కూడా ఉన్నారట. అలాగే నాలుగు వారాల నుంచి గ్రీవెన్స్ నిర్వహించని వారిలో ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ కూడా ఉన్నారని..ఇకపై పార్టీ ఆదేశాలను ఉల్లంఘిస్తే ఊరుకోబోనని లోకేశ్ హెచ్చరించినట్లు ఇన్‌సైడ్ టాక్. ఏదైనా అటు మంత్రి..ఇటు ఎమ్మెల్యేల తీరుపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ రెస్పాండ్ అవడం అయితే మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.

# రాజధాని రగడ..ఆగేదెలా




గుంటూరు, ఏప్రిల్ 10, అమరావతికి ముందు ఓకే అన్నారు. ఆ తర్వాత మూడు రాజధానుల స్లోగన్ అందుకున్నారు. అది వర్కౌట్ కాలేదు. అంతటితో ఇష్యూ క్లోజ్ అయిందనుకుంటే.. మావిగన్ అంటూ కొత్త స్లోగన్ అందుకున్నారు వైసీపీ అధినేత జగన్. ఉత్తరాంధ్ర వైసీపీ నేతల వాదన అయితే ఇంకా డిఫరెంట్. అమరావతి పేరుతో ఒకే దగ్గర అభివృద్ధి చేస్తే ఎలా అని ధర్మాన..అమరావతికి వ్యతిరేకం కాదంటూనే..మావిగన్ ప్రతిపాదనలో తప్పేం లేదంటూ కవర్ డ్రైవ్ స్టార్ట్ చేశారు బొత్స.?=అధినేత నుంచి..పార్టీలో సీనియర్ లీడర్ వరకు ఒక్కొక్కరిది ఒక మాట. ఎవరి మాటల్లో క్లారిటీ లేదు. అంతా కన్ఫ్యూజన్. గజిబిజి గందరగోళం. అమరావతికి వ్యతిరేకం కాదంటారు. జగన్ సూచించిన మావిగన్ ప్రతిపాదనలో తప్పేం లేదంటారు. జగనేమో ప్లాన్-ఎ త్రీ క్యాపిటల్స్..ప్లాన్-బి మావిగన్ అంటారు. అమరావతి పేరుతో ఒకేచోట అభివృద్ధి చేస్తే ఎలా అని ప్రశ్నిస్తారు. ఉత్తరాంధ్ర పరిస్థితి ఏంటంటూ నిలదీస్తారు. దీంతో ఒక ప్రధాన రాజకీయ పార్టీగా వైసీపీ..ఏపీ రాజధాని విషయంలో స్పష్టంగా ఉండలేకపోతోందా అన్న చర్చ సాగుతోందివైసీపీలో ఉన్న అన్ని ప్రాంతాల నాయకులు రాజధానిపై ఒకే మాట మీద ఉంటున్నారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధినాయకుడు జగన్ ఈ నెల 1న ప్రెస్ మీట్ పెట్టి మరీ మావిగాన్ అని ఒక కొత్త ప్రతిపాదన చేశారు. దాని మీద వైసీపీలోనే డిఫరెంట్ ఒపీనియన్స్ ఉన్నాయా అన్న డౌట్స్ వ్యక్తం అవుతున్నాయి. ఉత్తరాంధ్రకు చెందిన సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.2014లో వైసీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు..అసెంబ్లీలో ఏపీ రాజధానిగా అమరావతి అని చర్చకు వచ్చినప్పుడు ఫ్యాన్ పార్టీ కూడా రైట్ రైట్ అనేసింది. ఆ తర్వాత 2019లో అధికారంలో వచ్చాక మూడు రాజధానులు అన్న నినాదం ఎత్తుకుంది. ఆ సమయంలో విశాఖలో పరిపాలనా రాజధాని పెడతామని చెప్పుకొచ్చింది. దాంతో ఉత్తరాంధ్ర వైసీపీ నేతల ఆ విషయాన్ని గొప్పగా చెప్పుకునే వారు. వెనకబడిన ఉత్తరాంధ్రకు రాజధానిని తీసుకుని వస్తున్నామని కూడా భారీ ప్రకటనలు ఇస్తుండే వారు. అయితే ఐదేళ్ల వైసీపీ పాలనలో విశాఖ నుంచి కీలక అడుగు పడింది లేదు. పైగా పరిపాలనా రాజధాని అన్నది పబ్లిక్‌కు అర్థమయ్యే నాటికి వైసీపీ ప్రభుత్వం దిగిపోయింది. మూడు రాజధానులు కూడా అటకెక్కాయని లేటెస్ట్‌గా జగన్ ఇచ్చిన మావిగన్ స్టేట్‌మెంట్‌తో తేలిపోయిందంటున్నారు కూటమి నేతలు.చంద్రబాబు అమరావతి పేరుతో అభివృద్ధి అంతా ఒకే చోట పెడుతున్నారని మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శలు చేయడం ఇంకా ఇంట్రెస్టింగ్‌గా మారింది. అలా అయితే ఏపీలో ఇతర ప్రాంతాల అభివృద్ధి ఏం కావాలని ఆయన ప్రశ్నించారు. వెనుకబడిన ప్రాంతాల గురించి పట్టదా అని నిలదీశారు. అయితే జగన్ కూడా గుంటూరు, విజయవాడ మావిగన్ అంటూ క్యాపిటల్‌ను ప్రస్తావించారు. ఈ లెక్కన మావిగన్ ప్రతిపాదన రాజధాని కూడా గుంటూరు, విజయవాడ మధ్య అభివృద్ధి అంతా ఒకే చోట కేంద్రీకృతం కానుంది. దీంతో వైసీపీ నేతలు చెబుతున్న దానికి చేస్తున్న విమర్శలకు మావిగన్ ప్రపోజల్ కూడా టైంపాస్ ముచ్చటే అన్న టాక్ నడుస్తోంది.ఇక బొత్స సత్యనారాయణ లాంటి ఉత్తరాంధ్ర నేతలు అమరావతి రాజధానికి తాము వ్యతిరేకం కాదని అంటున్నారు. సేవ్‌టైమ్ జగన్ మావిగన్ ప్రతిపాదనలో తప్పేంటి అని సమర్థించుకుంటున్నారు. ఇక పక్క పక్క జిల్లాల్లో ఉన్న బొత్స కానీ ధర్మాన కానీ ఏపీ రాజధాని, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై వన్ లైన్ ఎజెండాతో ఉన్నారా అన్న చర్చ కూడా వస్తోంది. అమరావతికి బొత్స ఓకే అంటుంటే ధర్మాన వేరేలా మాట్లాడుతున్నారు. అధినాయకత్వం మావిగన్ అంటోంది. ఇలా తలో రకమైన అభిప్రాయం వ్యక్తం చేస్తుండటంతో..వైసీపీ తాను గందరగోళంలో చిక్కుకుని జనాలను కూడా కన్ఫ్యూజ్ చేస్తోందన్న టాక్ వినిపిస్తోంది.వైసీపీ నేతల డిఫరెంట్ టోన్‌కు కూటమి నేతల నుంచి ధీటుగానే ప్రతి విమర్శలు వస్తున్నాయి. విశాఖ రాజధాని ఏమైందో చెప్పాలని వారు కౌంటర్లు వేస్తున్నారు. మావిగన్ ప్రతిపాదన ధర్మానకు నచ్చిందా లేదా కూడా చెప్పాలని కోరుతున్నారు. మరోవైపు ఏపీ రాజధాని విషయంలో వైసీపీ నేతల మధ్య, ప్రాంతాల వారీగా ఆ పార్టీ లీడర్ల మధ్య ఒక ఏకాభిప్రాయం ఉందా లేదా అన్న డౌట్స్‌ను వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ తీరు ఇలాగే ఉంటే రాజధాని ఇష్యూనే గుదిబండగా మారి..రాబోయే రోజుల్లో పొలిటికల్‌గా అతిపెద్ద సవాల్‌గా మారే ప్రమాదం ఉంటుంది.

# శ్రీకాకుళం రోడ్ టు తిరుపతి డైరక్ట్ ట్రైన్స్

శ్రీకాకుళం, ఏప్రిల్ 10, శ్రీకాకుళం ప్రజలకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తీపికబురు చెప్పారు. శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా మొట్ట మొదటి రైలు అందుబాటులోకి రానుంది. రైల్వేశాఖ శ్రీకాకుళం రోడ్ టు తిరుపతి 17439/17440 హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను మంజూరు చేసింది. ఈనెల 13వ తేదీ నుంచి ఈ రైలు ప్రారంభంకానుంది. శ్రీకాకుళం రోడ్ నుంచి ప్రతి సోమవారం, తిరుపతి నుంచి ప్రతి ఆదివారం అందుబాటులో ఉంటుంది.శ్రీకాకుళం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది.. తిరుపతికి నేరుగా మొదటి రెగ్యులర్ రైలు సర్వీసుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చేసింది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని శ్రీకాకుళం నుంచి తిరుపతికి రైలు నడపాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరారు. వెంటనే స్పందించిన రైల్వేమంత్రి ఈ ప్రతిపాదనలపై అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో రెగ్యులర్ రైలును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈనెల 13 నుంచి శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి రైలు నంబర్ 17439/40 హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభంకానుంది. ఈ హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి బయల్దేరుతుంది.. అలాగే ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్డు నుంచి బయల్దేరుతుంది.శ్రీకాకుళం ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరిందంటూ కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. 75 ఏళ్ల జిల్లా చరిత్రలో తొలిసారిగా శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రెగ్యులర్ రైలు సర్వీస్ ప్రారంభమవుతోందని తెలిపారు. హంసఫర్ ఎక్స్‌ప్రెస్ (17439/17440) ప్రతి ఆదివారం తిరుపతి నుంచి, ప్రతి సోమవారం శ్రీకాకుళం నుంచి అందుబాటులోకి వస్తుందన్నారు. ఏప్రిల్ 13న శ్రీకాకుళం రోడ్ స్టేషన్ నుంచి ఈ రైలును ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ రైలు సర్వీస్‌ను మంజూరు చేసిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో శ్రీకాకుళానికి మరికొన్ని రైలు సర్వీసులు వచ్చేలా కృషి చేస్తానన్నారు.శ్రీకాకుళం జిల్లావాసులు తిరుపతికి, తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లాలంటే భువనేశ్వర్ నుంచి వచ్చే రైళ్లపై ఆధారపడేవారు. విశాఖపట్నం వెళ్లి అక్కడి నుంచి ప్రారంభమయ్యే రైళ్లలో వెళ్లాంటే రద్దీ ఎక్కువగా ఉంటోంది. అందుకే ఎప్పటి నుంచో శ్రీకాకుళం టు తిరుపతి రైళ్లను నడపాలనే డిమాండ్ ఉంది. మొత్తానికి సిక్కోలు వాసుల కల నెరవేరింది.. ఈ నెల 13 నుంచి రైలు అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా నుంచి తిరుమల శ్రీవారి దర్శనాల కోసం వెళ్లేవారికి ఈ రైలు ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెబుతున్నారు. అంతేకాదు ఇటీవల శ్రీకాకుళం జిల్లాలోని పలు రైల్వే స్టేషన్‌లకు కొత్తగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేందుకు హాల్ట్ కల్పించిన సంగతి తెలిసిందే.

# 2029 వైసీపీ స్లోగన్స్ రెడీ

విజయవాడ ఏప్రిల్ 10, ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అమరావతి అంశం పొలిటికల్ హీట్ పెంచింది. అమరావతికి కేంద్రం చట్టబద్ధత కల్పించిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సరికొత్త ప్రతిపాదనల్ని తెరపైకి తెచ్చారు. మావిగన్ పేరుతో మచిలీపట్నం, విజయవాడ, గుంటూరును కలిపి కారిడార్‌గా ప్రకటిస్తే బావుటుందన్నారు. అమరావతికి కంటే తక్కువ ఖర్చుతో రాజధానిగా అభివృద్ధి చేయొచ్చన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ మావిగన్ పేరుతో కొత్త స్లోగన్‌ను అందుకుంది. రావాలి జగన్, కావాలి మావిగన్ అంటూ ఫ్లెక్సీ?లు వెలిశాయి.2019 ఎన్నికలు అందరికి గుర్తున్నాయా.. వైఎస్సార్‌సీపీ 151 సీట్లలో ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అయితే 2019 ఎన్నికల సమయంలో ఒక స్లోగన్ రాష్ట్ర మొత్తం మార్మోగింది.. అదే 'రావాలి జగన్, కావాలి జగన్'. వైఎస్సార్‌సీపీ ఈ నినాదాన్ని ప్రజల్లోకి బాగా తీసుకెళ్లింది. అంతేకాదు 'రావాలి జగన్, కావాలి జగన్' అంటూ ఓ పాటను కూడా విడుదల చేయగా.. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. 2019 ఎన్నికలకు ఈ స్లోగన్ బాగా కలిసొచ్చింది.. జనాలను ఆకట్టుకుంది. ఇప్పుడు కూడా అదే తరహాలో మరో కొత్త స్లోగన్ తెరపైకి వచ్చింది.. రాష్ట్రంలో ఫ్లెక్సీలు కూడా ఏర్పాటవుతున్నాయి.వైఎస్సార్‌సీపీ.. రావాలి జ'గన్'..కావాలి మావి'గన్'




అంటూ కొత్త స్లోగన్‌ను మొదలు పెట్టింది. ఆ పార్టీ నేత కారుమూరు వెంకటరెడ్డి పేరుతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయగా.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'మన మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు.. ఆంధ్రప్రదేశ్ బాగుండాలి అంటే.. త్వరగా అభివృద్ధి చెందాలి అంటే.. మావిగన్ రాజధాని కారిడార్ అవ్వాలి.. అది జగనన్నతోనే సాధ్యం. మన రాజధాని మావిగిన్.. మావిగన్ ఆంధ్రప్రదేశ్‌కు గ్రోత్ ఇంజన్' అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీ చివర్లో.. అంతేకాదు లక్షల కోట్ల అప్పులు తీసుకురాకుండా అతి తక్కువ ఖర్చుతో 60 లక్షల జనాభాతో రెడీమేడ్ రాజధాని మావిగన్ అని రాశారు. కొందరు నెటిజన్లు ఈ ఫ్లెక్సీలను పోస్ట్ చేస్తున్నారు.ఈ ఫ్లెక్సీల్లో మావిగన్ ప్రాముఖ్యతను వివరించారు. మచిలీపట్నానికి మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ‌ఉ ఆస్పత్రి, సముద్రం, పోర్టు, రైల్వేస్టేషన్ వంటి సౌకర్యాలు ఉన్నాయని ప్రస్తావించారు. విజయవాడకు మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, కృష్ణానది, ఎయిర్‌పోర్ట్, రైల్వే జంక్షన్, అతిపెద్ద బస్ స్టేషన్, వ్యాపార వాణిజ్య కేంద్రం ఉన్నాయన్నారు. తాడేపల్లి ‌ఉ మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్, ఎయిమ్స్ ఆస్పత్రి, జాతీయ రహదారులు ఉన్నాయన్నారు. అలాగే గుంటూరులో మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, అతిపెద్ద మార్కెట్ యార్డ్, రైల్వే జంక్షన్, బస్ స్టేషన్, వ్యాపార వాణిజ్య కేంద్రం ఉందన్నారు. 2019లో సక్సెస్ అయిన రావాలి జగన్, కావాలి జగన్ స్లోగన్‌కు లింక్ చేస్తూ ఇప్పుడు రావాలి జ'గన్'..కావాలి మావి'గన్' అంటూ కొత్త నినాదాన్ని తెరపైకి తచ్చారు. మరి 2019లో హిట్ అయిన ఈ నినాదం 2029 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి కలిసొస్తుందా, లేదా అన్నది చూడాలి.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమరావతిపై లక్షల కోట్లు ఖర్చు చేయడం కంటే.. మచిలీపట్నం, విజయవాడ, మచిలీపట్నాన్ని కలిపి మావిగన్ పేరుతో 110 కిలోమీటర్ల కారిడార్‌గా ప్రకటించాలనే కొత్త ప్రతిపాదనను తెరపైకి తీసుకొచ్చారు. అమరావతికి ఖర్చు చేసే నిధుల్లో కేవలం 10శాతం ఖర్చు చేస్తే అద్భుతమైన గ్రోత్ ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు మావిగన్ ప్రతిపాదనకు మద్దతుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు

# చెవిరెడ్డికి జగన్ మధ్య ఏమైంది...

తిరుపతి, ఏప్రిల్ 10, నెల్లూరు పార్లమెంటు స్థానంలో వైసీపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డికి అవకాశం కల్పించనున్నట్టు తెలుస్తోంది. పార్టీమెంటు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసే అంశంపై వైసీపీ అధినేత జగన్ పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో తన కుటుంబానికి అత్యంత విధేయుడిగా ఉన్న చెవిరెడ్డికి నెల్లూరు టికెట్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. అయితే.. ఈ విషయంలో చెవిరెడ్డి విభేదిస్తున్నారని సమాచారం. తనకు అసెంబ్లీనియోజకవర్గం చాలని ఆయన కోరుతున్నట్టు తెలుస్తోంది. గత ఎన్నికల్లోనే తాను పొరపాటు చేశానని తరచుగా చెవిరెడ్డి చెబుతున్నారు. అప్పట్లో ఒంగోలు నియోజక వర్గం నుంచి ఎంపీగా పోటీ చేశారు. వాస్తవానికిపార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజలు ఓటేయాలి. గత ఎన్నికలను గమనిస్తే.. వైసీపీ తరఫున పోటీ చేసిన నలుగురు మాత్రమే విజయం దక్కించుకున్నారు. ఈ నలుగురు స్థానికంగా ఉన్న నాయకులే. పొరుగు జిల్లాల నుంచి వచ్చిన వారికి ప్రజలు తిరుగోమనం బాట పట్టించారు చిత్తూరు జిల్లాకు చెందిన చెవిరెడ్డి ఒంగోలులో పోటీ చేయడంతో ఇదే పరిస్థితి ఏర్పడింది. ఒంగోలు ప్రజలు స్థానిక నాయకుడు మాగుంట శ్రీనివాసుల రెడ్డికే పెద్దపీట వేశారు. దీంతో చెవిరెడ్డి ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఇక, ఇప్పుడు కూడా ఆయనను నెల్లూరు జిల్లాకు బదిలీ చేయాలని భావిస్తుండడంతో ఆయన అధిష్టానంపై తొలిసారి ఆగ్రహంతో ఉన్నట్టు తెలుస్తోంది. కానీ.. పైకి



చెప్పలేక.. పార్టీ అనుచరుల దగ్గర తన అభిప్రాయం వెల్లడిస్తున్నారు. తను సొంత జిల్లాలోనేఏదోఒక నియోజకవర్గంనుంచి పోటీ చేయాలని భావిస్తున్నట్టు చెవిరెడ్డి అంటున్నారు. వాస్తవానికి చంద్రగిరి ఇవ్వాలని కోరుతున్నా.. కుమారుడు మోహిత్ కోసం.. దానిని వదులుకున్నారు. ఇక, జిల్లాలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఒకవేళ నియోజకవర్గాలకు అవకాశం లేకపోతే.. తను పోటీ నుంచి తప్పుకొంటానని.. కేవలం ఇంచార్జ్‌గా మాత్రమే బాధ్యతలు చేపడతానని అంటున్నారు. ఈ పరిణామాల క్రమంలో ఇప్పుడు ఏం జరుగుతుందన్నది చూడాలి.

# అంతర్మథనంలో మాగుంట

ఒంగోలు ఏప్రిల్ 10,వచ్చే ఎన్నికల్లో తను కాదు.. తన కుమారుడు బరిలో నిలుస్తాడని ఆర్భాటంగా ప్రకటించిన ఒంగోలు ఎంపీ .. టీడీపీ నేత మాగుంట శ్రీనివాసుల రెడ్డి.. అంతర్మథనంలో పడ్డారని తెలుస్తోంది. పార్టీ వర్గాల సమాచారం మేరకు.. ఆయన తన కుమారుడు మాగుంట రాఘవరెడ్డికి అవకాశం ఇవ్వాలని అనుకున్నప్పటికీ.. స్థానికం గా ఉన్న పరిస్థితి అనుకూలంగా లేదని అంటున్నారు. మనసులో కోరిక ఉండడం వేరు.. క్షేత్రస్థాయిలో వాస్తవం వేరు. ఈ రెండు అంశాలుకూడా భిన్నంగా ఉంటాయి. ఇప్పుడు మాగుంట ఫ్యామిలీలో కూడా ఇలానే చర్చ సాగుతోంది. వాస్తవానికి గత ఎన్నికల్లోనే రాఘవరెడ్డిని బరిలో నిలపాలని అనుకున్నారు. కానీ, చంద్రబాబు ఈ విషయంలో ఆలోచన చేయాలని సూచించడంతో శ్రీనివాసులు రెడ్డి వెనక్కి తగ్గారు. కానీ.. ఇప్పుడు మరోసారి తన కుమారుడికి అవకాశం ఇప్పించే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. దీనిని స్వయంగా ప్రకటించారు కూడా. కానీ.. ఇప్పుడు మాత్రం కొంత ఆలోచనలో పడ్డారని అనుచరులు చెబుతున్నారు. యువకుడిగా రాఘవరెడ్డి వచ్చే ఎన్నికలకు పోటీ చేయడం బాగానే అనిపించినా.. ఒంగోలు ప్రజల నాడి మాత్రం దానికి అనుగుణంగా అయితే కనిపించడం లేదు. ఇటీవల అంతర్గతంగా చేసిన సర్వేలో ఇదే విషయం స్పష్టమైంది. రాఘవరెడ్డికి మాస్‌లో ఇమేజ్ తక్కువగా ఉందని తెలిసింది.

# పాదయాత్రల సాక్షిగా వర్డ్స్ వార్...

కడప, ఏప్రిల్ 10, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసి, సంక్షేమ రాజ్యానికి బాటలు వేసిన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చేపట్టిన చారిత్రాత్మక 'ప్రజాప్రస్థానం' పాదయాత్రకు నేటితో 23 ఏళ్లు పూర్తయ్యాయి. అయితే, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన వారసులు, అన్నాచెల్లెళ్లు అయిన వైఎస్ జగన్, వైఎస్ షర్మిల మధ్య సోషల్ మీడియా వేదికగా సాగిన మాటల యుద్ధం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తండ్రి ఆశయాల వారసులం మేమంటే మేమని ఇద్దరూ క్లెయిమ్ చేసుకుంటున్నప్పటికీ, ఒకరిపై ఒకరు చేసుకున్న విమర్శలు శృతిమించాయి.మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ తన తండ్రి పాదయాత్రను గుర్తు చేసుకుంటూ భావోద్వేగపూరితమైన ట్వీట్ చేశారు. ఏప్రిల్ 9, 2003న ఎర్రటి ఎండలో ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి వైఎస్సార్ వేసిన అడుగులు, రాష్ట్ర చరిత్రను తిరగరాశాయని ఆయన కొనియాడారు. "నేనున్నాను" అనే భరోసాతో ప్రజల గుండెల్లో వైఎస్సార్ నిలిచిపోయారని, ఆ పాదయాత్రే ఆయన్ను ముఖ్యమంత్రిని చేసిందని పేర్కొన్నారు.ముఖ్యంగా వైఎస్సార్ హయాంలో జరిగిన ఉచిత విద్యుత్ సంతకం, జలయజ్ఞం, పోలవరం ప్రాజెక్టు వేగం, విద్య, వైద్య రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులను జగన్ గుర్తు చేశారు. తన తండ్రి వేసిన ఆ ముద్రను ఎవరూ చెరిపేయలేరని, అదే స్ఫూర్తితో తన ప్రయాణం కొనసాగుతుందని జగన్ స్పష్టం చేశారు. తండ్రి వారసత్వాన్ని తన సంక్షేమ పాలనతో ముందుకు తీసుకెళ్తున్నానని ఆయన పరోక్షంగా ఈ ట్వీట్ ద్వారా సందేశాన్ని ఇచ్చారు.జగన్ ట్వీట్‌కు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అత్యంత ఘాటుగా స్పందించారు. వైఎస్సార్ పాదయాత్రను ఒక కాంగ్రెస్ సైనికుడిగా, పీసీసీ అధ్యక్షుడిగా ప్రారంభించారన్న విషయాన్ని ఆమె ప్రధానంగా గుర్తు చేశారు. వైఎస్సార్ పేరును పార్టీలో పెట్టుకుని, ఆయన ఆశయాలకు విరుద్ధంగా జగన్ వ్యవహరిస్తున్నారని నేరుగా విమర్శించారు.లౌకికవాదానికి నిలువుటద్దంలా నిలిచిన వైఎస్సార్ ఎక్కడ? మతోన్మాద బీజేపీకి ఢిల్లీలో తలవంచి, రాష్ట్రంలో మౌనం వహిస్తున్న జగన్ ఎక్కడ? అని ఆమె ప్రశ్నించారు. వక్ఫ్ చట్టం, దళిత క్రైస్తవుల రిజర్వేషన్ల వంటి అంశాల్లో జగన్ వైఖరిని ఆమె తప్పుబట్టారు. జగన్ ఐదేళ్ల పాలనలో దళితులు, మహిళలు, మైనారిటీలపై దాడులు పెరిగాయని, ఇది వైఎస్సార్ ఆత్మ క్షోభించేలా ఉందని ఆరోపించారు. ఫాసిస్టు శక్తులకు, క్యాపిటలిస్టులకు జగన్ దాసోహమయ్యారని షర్మిల విమర్శించారు. వైఎస్సార్ ఆశయాలకు పూర్తి భిన్నంగా ఉంటూ ఆయనకు నివాళులు అర్పించడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. జగన్ ఇప్పుడు చేయాల్సింది పాదయాత్ర కాదని, ఆత్మవిమర్శన యాత్ర అని చురకలు అంటించారు.ఒకప్పుడు అన్న కోసం ఉప ఎన్నికల్లో, పాదయాత్రలో అలుపెరగకుండా శ్రమించిన షర్మిల, నేడు అదే అన్నపై రాజకీయంగా యుద్ధం ప్రకటించడం వైఎస్సార్ అభిమానులను విస్మయానికి గురి చేస్తోంది. వైఎస్సార్ పాదయాత్ర వార్షికోత్సవం సాక్షిగా బయటపడ్డ ఈ విభేదాలు, కేవలం కుటుంబ కలహాలే కాక, సిద్ధాంతపరమైన పోరాటంగా కూడా మారుతున్నాయి.

## చాబోలు గ్రామంలో కేంద్ర పథకాల పరిశీలన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 10-నంద్యాల మండలం చాబోలు గ్రామంలో శుక్రవారం కేంద్ర పర్యవేక్షణ బృందం పర్యటించింది. గ్రామంలో అమలవుతున్న వివిధ కేంద్ర పథకాల పనితీరును పరిశీలించి, రికార్డులను తనిఖీ చేసి ఫీల్డ్ సందర్శన నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు, ఎంపీడీవో సుగుణశ్రీ, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కొత్త సిమెంట్ రోడ్డు పై కమిషనర్ తనిఖీ--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 10-నంద్యాల పట్టణంలో ఇటీవల నిర్మించిన సిమెంట్ రోడ్డు పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న పరిశీలించారు. రోడ్డు నాణ్యత, నిర్మాణ ప్రమాణాలు, డ్రైనేజీ సదుపాయాలను ఆయన స్వయంగా పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వీధి వెంబడి నివసిస్తున్న ప్రజలతో కమిషనర్ మాట్లాడారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది సమయానికి వచ్చి తడి, పొడి చెత్తను వేరు చేసి సేకరిస్తున్నారా, తాగునీటి సరఫరా సమయానికి జరుగుతోందా, ఇతర మౌలిక వసతులపై ఎలాంటి సమస్యలు ఉన్నాయా అని వివరంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కొన్ని ప్రాంతాల్లో చెత్త సేకరణలో ఆలస్యం జరుగుతోందని, నీటి సరఫరా సమయాల్లో మార్పులు ఉన్నాయని కమిషనర్ దృష్టికి తీసుకురాగా, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. పట్టణంలో మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. కొత్తగా వేసిన సిమెంట్ రోడ్లు దీర్ఘకాలం ఉపయోగపడేలా నాణ్యతలో రాజీ పడవద్దని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఈలు. ఏఇలు మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్వైజర్లు లక్ష్మీనారాయణ, శివ ప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లపై కమిషనర్ తనిఖీ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 10-నంద్యాల పట్టణంలోని అన్న క్యాంటీన్లను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు . ఈ సందర్భంగా క్యాంటీన్లలో అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, మెనూ ప్రకారం వంటకాలు అందిస్తున్నారా లేదా అనే అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. భోజనంలో నాణ్యతకు ఏమాత్రం లోటు ఉండకూడదని, ప్రజలకు శుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందించడం ప్రాధాన్యంగా చూడాలని సూచించారు. క్యాంటీన్లలో మెనూ ప్రకారం ఆహారం అందించడంతో పాటు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు ఆదేశించారు. భోజనం కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సకాలంలో సేవలు అందించాలని పేర్కొన్నారు. అలాగే క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించి, సేవల్లో మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎక్కడైనా లోపాలు గమనించినట్లయితే వెంటనే సరిదిద్దాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్వైజర్ లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడిని కాపాడుదాం – బడిలో పిల్లలను చేర్పిద్దాం..

- పిలుపునిచ్చిన యుటిఎఫ్ మండలాధ్యక్షుడు ఆరెకంటి భాస్కర్...



విభారే న్యూస్ ఏప్రిల్ 10 ఎమ్మిగనూరు.. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, బలోపేతం కోసం ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా భాగస్వామ్యం తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యుటియఫ్) ఎమ్మిగనూరు మండల రూరల్ అధ్యక్షుడు ఆరేకంటి భాస్కర్ పిలుపునిచ్చారు.?శుక్రవారం ఎమ్మిగనూరు మండల పరిధిలోని కడిమెట్ల ఎర్రకోట గ్రామాల్లో ఉన్నటువంటి నాలుగు ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా "ప్రభుత్వ బడిని కాపాడుకుందాం – ఊరి బడిలో పిల్లలను చేర్పిద్దాం" అనే కార్యక్రమంలో భాగంగా యుటియఫ్ వారు రూపొందించిన ప్రచార పోస్టర్లు, కరపత్రాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు.?ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ. నమోదు పెంపు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులు గ్రామాల్లోని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుల పాత్ర: విద్యా వ్యవస్థలో ప్రభుత్వ పాఠశాలలు నిలబడాలంటే ఉపాధ్యాయుల కృషితోనే సాధ్యమని ,ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ప్రచార సాగ్రి:గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడుల్లో ఉన్న వసతులు, నాణ్యమైన బోధన గురించి వివరించేలా కరపత్రాలను సిద్ధం చేశామని తెలిపారు.?ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మోషేరాజు,ప్రమీలరాణి, చిన్న నరసన్న ఉపాధ్యాయులు వంశీకృష్ణ షాకీర్,సురేంద్ర, చంద్రకళ, శ్రీదేవి, భారతి, జ్యోతి, నరసింహులు,ప్రవళిక,రేవతి, అక్బర్‌మల్లికార్జున ,కేశన్న, నరేష్,సరోజ,శేకున్ సి.ఆర్.పి. జయరాముడు, యుటీయుఫ్ నాయకులు పాల్గొన్నారు.

## చెత్తా శుద్ధీకరణ త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్, నగరపాలక ప్రత్యేక అధికారి డా. ఏ.సిరి

శుక్రవారంనగరంలోని ఘన వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణలో భాగంగా గార్గేయపురం డంప్‌యార్డులో నిల్వ ఉన్న లెగసీ వ్యర్థాలను బయో మైనింగ్ ప్రక్రియ ద్వారా త్వరితగతిన శుద్ధి చేసి, భూభాగాన్ని పునర్వినియోగానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి దేవనగర్‌లోని మురుగు శుద్ధి కేంద్రం (ఎస్టీపీ), గార్గేయపురం డంప్యార్డును పరిశీలించారు.గార్గేయపురం డంప్‌యార్డులో సుమారు 15 ఎకరాల్లో పేరుకుపోయిన లెగసీ వ్యర్థాలపై బయో మైనింగ్, బయో రిమిడియేషన్ ప్రక్రియలను వేగవంతం చేసి, రికవర్డ్ మెటీరియల్స్ను శాస్త్రీయంగా వర్గీకరించి వినియోగించాలన్నారు. తదనంతరం వేస్ట్ టు ఎనర్జీ యూనిట్, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్‌ఎఫ్) ప్లాంట్ల స్థాపనకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, అమలు దశకు తీసుకెళ్లాలని ఆదేశించారు. దేవనగర్ వద్ద మురుగు శుద్ధి కేంద్రం నిర్వహణను స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌ఓపీ) ప్రకారం మెరుగుపరచాలని, ట్రీటెడ్ వాటర్ నాణ్యతను నిరంతరం మానిటరింగ్ చేయాలని సూచించారు. అదేవిధంగా, సంబంధిత మౌలిక వసతుల నిర్వహణ బాధ్యతలను త్వరలో పబ్లిక్ హెల్త్ విభాగం నుండి కార్పొరేషన్‌కు బదిలీ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు.కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఈఈ గుర్రప్ప, డిఈయూ.వెంకటేశ్వర్లు, ఏఈ నాగశేష, నగరపాలక ఎస్‌ఈ రమణమూర్తి, కార్యదర్శి నాగరాజు, ఎంఈలు గిరిరాజ్, డిఈఈలు పవన్, ఏఈ వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.


## జిల్లాలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

### అందరికీ తాగునీరు అందాలి

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, ఏప్రిల్ 10:జిల్లాలో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను హెచ్చరించారు.శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో తాగునీరు,పారిశుధ్య మిషన్ సమావేశం మరియు తాగునీటి సమస్యలు, పారిశుధ్యం అంశాల పై అన్ని మండలాల ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఆర్ డబ్ల్యూ ఎస్ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సరఫరా మరియు పారిశుధ్య నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత అధికారుల మీద చర్యలు తప్పవని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. కర్నూలు జిల్లాలో భూగర్భ జలాల మట్టం తగ్గిపోవడం, బోర్‌వెల్స్ తరచుగా పాడైపోవడం వల్ల త్రాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. తుంగభద్ర డ్యామ్ నుండి జనవరి 20 వరకు నీటిని విడుదల చేయడం వల్ల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నింపుకున్నామని, మార్చి 20 వ తేదీ నుండి మళ్లీ నీటి విడుదల ప్రారంభమైనందున, ట్యాంకులను నింపుతున్నామని, ఆగస్టు చివరి వరకు నీటి కొరత ఉండదని భావిస్తున్నామన్నారు. నీటి వనరులు ఉన్నాయి, అయినా నీటి సమస్యలు ఎందుకు వస్తున్నాయని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి, గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ప్రాంతానికి సమానంగా నీటి సరఫరా జరగాలన్నారు. ఎక్కడైనా పక్షపాతం లేదా నిర్లక్ష్యం జరిగితే సహించబోనని కలెక్టర్ తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు సంబంధించి గ్రామాల్లో చెత్త కుప్పలు పేరుకుపోయాయని, క్రమం తప్పకుండా వాటిని పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించాలని కలెక్టర్ డిపిఓ ను ఆదేశించారు. అదే విధంగా తాను పర్యటన కు వెళ్ళిన సమయంలో కొన్ని చోట్ల చెత్త శుభ్రం చేస్తున్నట్లు, కొన్ని చోట్ల చెత్తను అలాగే వదిలేస్తున్నట్లు గమనించామని, అలాగే కొన్ని చోట్ల తాగు నీరు వృథా అవుతున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఒకే ప్రాంతం నుండి తాగునీరు, పారిశుధ్య నిర్వహణకు సంబంధించి పత్రికల్లో ప్రతికూల వార్తలు రెండు మూడు సార్లు వస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. నిర్లక్ష్యం వహించే సిబ్బందికి మూడు ఇంక్రిమెంట్లు నిలిపివేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నీరు సరఫరా చేయడం లేదని ప్రతికూల వార్తలు రాకూడదన్నారు. అదే విధంగా లీకేజీ సమస్యలు కూడా ఉండకూడదన్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ ప్రాథమిక బాధ్యత పారిశుధ్యం శుభ్రంగా ఉంచడం త్రాగునీరు సమస్యలు లేకుండా చూసుకోవడం అని, పై నుండి కింది స్థాయి సిబ్బంది వరకు ఈ అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిన్న తాను కోసిగి కి క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్ళిన సమయంలో ఒక మైనర్ అమ్మాయికి బాల్య వివాహం చేస్తున్నారని విషయం తెలిసి, ఆ పెళ్లిని ఆపగలిగానన్నారు. తహసీల్దార్, ఓఖఆూ, అఆఖూ లు, వారి స్టాఫ్ ఏం చేస్తున్నారని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు? బాల్య వివాహాలను ఆపాల్సిన బాధ్యత అందరి మీద ఉంటుందన్నారు. నీటి సరఫరాలో వివక్ష చూపకూడదని, అందరికీ సమానంగా మరియు న్యాయంగా నీరు అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఒక ఏరియాలో ఎక్కువ, మరొక ఏరియాలో తక్కువ నీరు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

## మహిళా కోటా వస్తే నంద్యాలలో అఖిలప్రియ ముందంజ--





విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 10:మహిళా రిజర్వేషన్ బిల్లుతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలు రూపుదిద్దుకుంటున్నాయి. పునర్విభజన అనంతరం మహిళా కోటా అమలైతే నంద్యాల నియోజకవర్గంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు గెలుపు అవకాశాలు మెరుగుపడతాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.దివంగత భూమా నాగిరెడ్డి రాజకీయ వారసత్వం, నంద్యాలలో కుటుంబానికి ఉన్న బలమైన అనుబంధం అఖిలప్రియకు ప్రధాన బలంగా నిలుస్తోంది. మంత్రిగా పనిచేసిన అనుభవం, క్షేత్రస్థాయి కేడర్ మద్దతు ఆమెకు అదనపు బలాన్ని అందిస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీల్లో సమాన స్థాయి మహిళా నాయకత్వం లేకపోవడం కూడా ఆమెకు అనుకూలంగా మారే అంశంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.పునర్విభజన తర్వాత నంద్యాల మహిళా రిజర్వేషన్ జాబితాలోకి వస్తే, ఇతర పార్టీలకు అభ్యర్థుల ఎంపిక సవాలుగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో భూమా కుటుంబ ప్రభావం, అఖిలప్రియ రాజకీయ అనుభవం కలసి ఆమెను ముందంజలో నిలబెట్టే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## రాంకోపై పోరాటం తీవ్రం చేస్తాం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 10:రాంకో సిమెంట్ యాజమాన్యం రైతులకు అన్యాయం చేస్తే సహించబోమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు హెచ్చరించారు. శుక్రవారం సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10న చేపట్టాల్సిన రాంకో ముట్టడి కార్యక్రమాన్ని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి హామీ మేరకు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. 11న మంత్రి తో చర్చలు జరగనున్నాయని, రైతులకు న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.ఫ్యాక్టరీ స్థాపన సమయంలో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని, కాలుష్యంతో పంటలు దెబ్బతిన్నాయని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## తితిదే ధార్మిక కార్యక్రమాలు ముగింపు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , ఏప్రిల్ 10:గడివేముల మండలం కరిమద్దెల గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా డాక్టర్ మల్లు వేంకటరెడ్డి మాట్లాడుతూ సర్వభూత దయయే నిజమైన తపస్సని అన్నారు. కార్యక్రమంలో భాగంగా గోపూజ, కుంకుమార్చనలు నిర్వహించారు. గత మూడు రోజులుగా రామాయణం, మహాభారతం, భాగవతంపై ప్రవచనాలు, భజనలు భక్తులను ఆకట్టుకున్నాయి. స్థానిక భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## కేసీ కాల్వలో బాలుడు మృతి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఏప్రిల్ 10-నంద్యాల జిల్లా పొన్నాపురం గ్రామ సమీపంలోని కేసీ కాల్వ వద్ద విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సుమారు 15 ఏళ్ల బాలుడు చేపల వేట కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు.కుటుంబ సభ్యులు, బంధువులు రాత్రి మొత్తం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. శుక్రవారం ఉదయం సమీప చెక్‌డ్యామ్ వద్ద బాలుడి మృతదేహం లభ్యమైంది.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కాల్వలో మునిగి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190